# వాళ్ళనలా వదిలేద్దాం

శ్రీ సేమాని సంగమేశ్వరరావు

(గతసంచిక తరువాయి)

"ప్రభాకర్ వున్నాడే - చచ్చిపోతా డనుకో మ్యూజిక్ అంటే - అందులో కర్ణాటక సంగీతమంటే మరీని!"

"అయితే"

ఈ ముక్తసరి జవాబులకి కొంచము విసుక్కొన్నట్టు గిరి ముఖంలో భావాలు చూసింది దమయంతి.

"నీవువచ్చి ఒక పాట ..."
సంకోచంతో ఆగేడు గిరి.

"నా వొంట్లో బాగాలేదు అన్నయ్యా! నేను ఇప్పుడేమీ పాడలేను ..." అంది నిరుత్సాహంగా.

"అలా అంటే ఎలా చెల్లీ! అతనితో చెప్పి వచ్చేనే! వాడేమి అనుకుంటాడో- మరి నీ యిష్టం" అన్నాడు గిరి కొంచం ప్రాధేయ పూర్వకంగా.

"నువ్వెప్పుడూ యింతే అన్నయ్యా! నా సంగతి నీకు తెలుసుండికూడా విషమ పరీక్షలో పెడతావు. నేను కొత్త వాళ్లతో తిరగడంగాని, మాట్లాడడంగాని తప్పించుకుంటూ వుంటాను. అలాంటిది నన్ను పాడమని వేధిస్తే ఎలా?" అంది కొంచం ఏడుపుభీతి మొహంతో దమయంతి.

"పోనీలే చెల్లీ! నీవు పాడొద్దులే! నీవు కష్టపడడం నాకు యిష్టంలేదు! నీ వొంట్లో బాగా లేదని చెప్పేస్తాను." అన్నాడు బయలుదేరుతూ.

"అన్నయ్యా?"

ఆగేడు-చెల్లిలి మొఖం చూసేడు గిరి.

"నీవు వెళ్లు! ... ఐదు నిముషాలలో చీరమార్చుకొని వస్తాను. ఇంకెప్పుడూ ఇలా చెయ్యకు ... ఆ ... చూడు సీతను వచ్చి ఈ ఫిడేల్ కిందకితీసికెళ్ళమని చెప్పు" అంది.

"అలాగే" అంటూ సంతోషంతో మేడదిగి సీతను పిలిచి మేడమీదకి పంపించేడు. ప్రభాకరరావు దగ్గరకువచ్చి యిలా అన్నాడు.

"గంధర్వగానమనుకో! నీవెప్పుడు వినలేదుగాని!" అన్నాడు గిరి ప్రభాకరరావుతో కొంచం గర్వంగా.

"ఆ! అలాగా! నేను ఎప్పుడూ విన

లేదుగా! అయినా బ్రదర్! నాకు తీరిక ఎక్కడరా? మొన్నటివరకు చచ్చేననుకో. అయినా పగవాడికికూడా వద్దురా ఈ చదువులు! మొత్తానికి M.B.B.S అయిపోయిందనుకో!"

"ప్రాక్టీసు ఎక్కడ పెడతావు?"

"ఇంకా నిశ్చయించలేదు - మూడొంతులు యిక్కడే పెడతాను. అమ్మ, నాన్న ఇక్కడే పెట్టమంటున్నారుకూడాను."

సీత ఫిడేల్ కేసు తెచ్చి బల్లమీద పెట్టి వెళ్లిపోయింది.

చీరమార్చుకొని ఒక్కసారి తన ప్రతిబింబం అద్దంలో చూసుకుంది దమయంతి! స్లిప్పర్ తొడిగి తాపిగా మెట్లుదిగి హాలు మధ్యకు వచ్చింది.

అన్నయ్య, స్నేహితుడు లేచి నిలబడ్డారు. అన్నయ్య పరిచయంచేసేడు.

"ఈమే నా సిష్టర్ దమయంతి–II year Arts చదువుతున్నాది–ఇతడే నా మిత్రుడు Dr. ప్రభాకరరావు M.B.B.S"

"నమస్తే" అన్నాడు ప్రభాకరరావు వుత్సాహంగా.

"నమస్తే" అంది దమయంతి నీరసంగా.

"నేను ఎప్పుడూ మిమ్ములను చూడ లేదు! ఆ భాగ్యం ఇవాళ కలిగింది!" అన్నాడు ప్రభాకరరావు హుషారుగా.

మౌనంగా కూర్చొని ఫిడల్ కేసు క్లిప్పులు తీస్తున్నాది.

"మీరు ఎప్పుడయినా రేడియో ప్రోగ్రాములు యిచ్చేరా?" అన్నాడు ప్రభాకరరావు.

"అబ్బే! లేదండి! ఐనా నాకేమంత సంగీత మొచ్చునని ..." అంది వుత్సాహంగా - మళ్ళా ఎక్కువ మాట్లాడినట్లు ఫీలయి కొంచము సమాళించుకొంది.

శ్రావ్యముగా పాడినపాటవిని తన్మయుడయ్యాడు ప్రభాకర్. పాట ఆపగానే "Marvellous,...wonderful... అమరగానం ... నిజంగా సరస్వతీదేవివచ్చి ఫిడేలు పట్టుకున్నదా అన్నట్టువుంది. ..." ఇలా తెగ పొగుడుతూ అందులో లీనమయిపోయి షేక్ హేండ్ యివ్వబోయేడు, ప్రభాకరం.

తను వెనక్కి తగ్గింది కొంచం కోపంతో! అయినా కొంచం అలుచిస్తే నెత్తిమీద కెక్కుతారు ఈ మగజాతి అని అనుకుంది అసహ్యించుకుంటూ

నాలుక కఱచుకొని "క్షమించాలి" అన్నాడు ప్రభాకరం కొంచం ఫీలయి.

"ఫరవాలేదులెండి" అంది కొంచం కోపంతో లేచింది! "వస్తాను! వొంట్లో

బాగా లేదు! అదోలా వుంది'' అని అంటూ జవాబు ఆశించకుండానే బరువుగా అడుగులు వేస్తూ మేడమీద తన గదిలోకి దారి తీసింది దమయంతి.

దమయంతి వెళ్లిన తరువాత రెండు నిముషాలు హాలు నిశ్శబ్దంగాయుంది.

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ప్రభాకరం ఇలా అన్నాడు. "మీ సిష్టర్ యింత బాగా పాడుతుందని అనుకోలేదోయ్! రేడియో వాళ్లు విన్నారంటే కళ్లనద్దుకుంటారు.''

"అవవచ్చు! అయినా దానికి తగని సిగ్గు. అదీకాకుండా అది ఇలాంటివి like చెయ్యదు''

"లైక్ చెయ్యకపోవడమంటే నాకేమీ అర్థం కాలేదు! దానిలో తప్పేముంది?''

"తప్పేమీ లేదనుకో. అయినా దానిది ఒక విధమయిన వింతమనస్తత్వం!''

"అవునులే! రకరకాల మనుష్యులు- రకరకాల మనస్తత్వాలు!'' అంటూ లేచేడు ప్రభాకరం. "వస్తా! మళ్లా కలుసుకుందాం'' అంటూ దారితీసేడు.

మేడమీద తనగదిలోకి వెళ్ళి టేబిలు లైటు వేసుకొని చదువడానికి పూనుకున్న దమయంతి రెండు పంక్తులుకూడా చదువలేకపోయింది. ఆలోచనలు అడ్డులేకుండా పరుగెత్తుతున్నాయి!

"ప్రభాకరం మనిషి మంచివాడిలాగే కనబడుతున్నాడు! అనాకారికాడు. ఒక విధంగా అందగాడే! నాజూగ్గా సీతాకోక చిలుకలాగ బట్టలు వేసుకున్నాడు. పాతిక ఏళ్ళకి ఎక్కువ వుండవు. సరదా అయిన వాడిలాగే కనబడుతున్నాడు.''

మనోవీధిలో తన ప్రక్కను ప్రభాకరాన్ని నిలబెట్టుకుంది దమయంతి.

సరిగ్గా అతని బుజములదగ్గరకు వచ్చింది తను. తనూ - అతనూ, అతనూ - తను! కొలిచింది! తూచింది! అతనిచేతిలో సిగిరెట్టు! జేబులో స్టెతస్కోపు! కళ్ళద్దాలు .........''

ఛీ! ఛీ! ఇదేంటి యిలాంటి తలపులు! ఇంతవరకూ అతను ఎవరో! అతని మనస్తత్వం, ఊహలు, ఉద్దేశాలు ఎలాంటివో? తన ప్రక్కను అతను వుండడమేమిటి? జుగుప్సతో ఒక్కసారి నుంచుంది! ఈ తలంపులతో ఒళ్ళంతా గగుర్పాటు చెందింది చెమటపట్టింది ......... అటూ యిటూ తనగదిలోనే పచారు చేస్తున్నది! స్నానము చేస్తే హాయిగావుండి ఈ తలంపులన్నీ దాటి రిలీఫ్ వుంటుందనుకుంది! సీతను కేక వేసింది.

సీతరాగానే స్నానానికి నీళ్లు అవీ పెట్టమంది. సీత వెళ్లి స్నానాలగదిలో సోపు, టవలు, చీర వుంచి, వచ్చి చెప్పింది.

చెప్పల్ తొడుగుకొని స్నానాల గది

లోకి వెళ్ళింది దమయంతి. గది తలుపు లోపలకు గడియవేసింది. ఎలక్ట్రిక్ కాంతి నలుప్రక్కల ప్రకాశిస్తోంది.

నగ్నంగా స్నానము చేస్తున్న దమయంతి తన నగ్నశరీరం వేపు, అంగసౌష్టవము వేపు ఒకసారి చూసుకుంది! తన యివ్వనం తనకే అసహ్యము వేస్తున్నట్టుంది!

చటుక్కున చీర చుట్టుకొని స్నానాల గది తెఱచి బయటకివచ్చింది దమయంతి. మేడమీద తనగదిలోకి వెళ్ళి చీరమార్చుకుంది.

నాన్నగారు రావడమేమిటి, ఎనిమిది గంటలు కొట్టడమేమిటి రెండూ ఒక్కసారి జరిగేయి! భోజనాలకు వెళ్ళింది అందరితోను. తను, అన్నయ్య, నాన్నగారు ముగ్గురూ కూర్చున్నారు.

అమ్మేవడ్డిస్తున్నాది; వంటలక్కరాలేదు. మరి రవణమ్మ పెళ్ళికి వెళ్లిందిగా! భోజనం దగ్గర కూర్చున్న దమయంతి అన్నం సరిగ్గా తినకుండా ఏవేవో ఆలోచించుకుంటున్నాది.

"నిజంగా జీవితంలో స్త్రీ లేనిదీ పురుషుడు, పురుషుడు లేందీ స్త్రీ రాణించరు కాబోలు! లేకపోతే ఎందరోమహానుభావులు, విజ్ఞానులు పెళ్లిళ్ళు ఎందుకు చేసుకుంటారు? తను వాళ్లకంటె తెలివయినదా? లేక సంస్కారవంతురాలా? తనే తప్పు అభిప్రాయపడి వుండవచ్చు!"

అయితే తన భయం పెళ్లి అయిన తరువాత ఎలాంటి భర్తతో సంసారం సాగించవలసి వస్తుందో - ఏమో! అతని ఉద్దేశాలు తన భావాలు కలువకపోతే - అంతకంటె మరి నరకం వుండదు! ఆ! ఎందుకు కలవకపోతాయి! కలిసితీరతాయి; మళ్ళా తన మెదడులోకి ప్రభాకరం వచ్చేడు! ప్రభాకర్‌తో జీవితం ఆనందమయంగా చేసుకోవచ్చు!

"అమ్మా! కొంచం అన్నంపెట్టు!" అన్నాడు అన్నయ్య గిరి.

తల్లి వాడికి అన్నంపెట్టి తన ప్రక్క చూసి "ఏం తల్లీ! ఏం కావాలి" అంది.

తను ఏమీ జబాబు చెప్పలేదు.

"అమ్మా! ప్రభాకర్ M. B. B. S. అయిపోయిందే! ఈ వూళ్లోనే ప్రాక్టీసు పెడతాడట" అన్నాడు గిరి.

"ప్రభాకరం అంటే సీతాపతిగారి అబ్బాయికదూ!" అంది సందేహంగా తల్లి గిరితో

"ఆ! అతనే! చాల మంచివాడు!" అన్నాడు తండ్రి ముక్తసరిగా.

ఈ మాట వినగానే ప్రాణంలేచొచ్చి

నట్టయింది దమయంతికి. తిండిమీదకి దృష్టి పోవడంలేదు.

“గిరీ! అతనికింకా పెళ్లి కాలేదుకదూ!” అంది తల్లి మళ్లా

“ఏదమ్మా! మొన్ననే M. B. B. S. అయింది. ప్రాక్టీసు పెడితేగాని పెళ్లి చేసుకోనంటున్నాడు”

“అదేమిటే! అన్నం తినకుండా దిక్కులుచూస్తున్నావ్! మజ్జిగపొయ్యనా” అన్న తల్లి మాటలు వినిపించుకోకుండా ప్లేటు ముందుకి నెట్టి చెయ్యికడుక్కోని మేజమీదకి నడిచింది దమయంతి.

(సశేషము)







అన్ని మందుల షాపులలోను లభించును